# "మంచి" "చెడ్డ" ల్లో ఏ కథ

రావణుడా? రామచంద్రుడా?

హిట్లరా? చర్చిలా?

ఎవరంటే మీకిష్టం?

అనే ప్రశ్నకి మీరిచ్చే సమాధానంలో మీ స్వభావం కొంత వెల్లడవుతుందని నా నమ్మకం.

నాకు చిన్నప్పణ్ణుంచీ ఆ వెర్రి నమ్మకం ఒగటి అలా ఉండిపోయింది. ఆ విషయం గురించి ఈ తరవాత వివరంగా చెప్తాను.

ఇంకా అర్ధరాత్రి కాలేదు. పదకొం డవుతుందేమో. అంతే. నేను నా మామూలు ఇరానీ హొటేల్లో కూర్చొని టీ తాగుతున్నాను. ప్రొప్రయిటరు కాష్‌కౌంటర్ దగ్గర కూర్చొని కునికిపాట్లు పడుతున్నాడు. పదిహేను పాలరాతి బల్లలమీద విద్యుద్దీపాల కాంతి ఇంకినంత ఇంకి, జారినంత జారి, చాలామట్టుకు చెల్లాచెదరవుతోంది. మీదనున్న పంకా, చాలా తీరుబాటుగా అలవాటు తప్పిపోకుండా మాత్రం తిరుగుతోంది. రెండు రోజులు వరసగా వర్షం పడింది. ఆవేళకూడా కొద్దిగా పడుతోంది. వీధి లోని చలిగాలి ఒక్కొక్కసారి గప్పున లోనికి రాబోయి లాభంలేక గుమ్మం దగ్గరే ఉండిపోతోంది. పాలూ, బిస్కెట్లూ, రొట్టె వాసన్లతో హొటేల్లో, వెచ్చగా, అంతా బావుంది.

అంతలో "ఆఁ! ఉన్నాడు గురుడు!" అంటూ రావూ, మూర్తీ లోనికి వచ్చి, దగ్గిరకొచ్చి చెరో కుర్చీ సరిగా సర్దుక్కూర్చొని....

"ఎప్పుడొచ్చేవు? ఏఁవిటీ కథ? మధ్యాన్నం కాలేజీ అంతా నీకోసం గాలించేం. లైబ్రరీలోనూ లేవు, క్లాసులోనూ లేవు. ఎక్కడికి పోయేవు?" అని అడిగేరు.

"రూంలో ఉండిపోయేను".

"సరేకాని, నీకోసమే ఒచ్చేం".

"ఏఁవిటి సంగతి?"

"ఇదీ సంగతి!"

అంటూ రెండు కాయితాల కట్టలు-పెద్ద దస్తరాలేంకావు-తెలుగున పైపు చేసినవి నా ఎదర పడేసేరు.

"అదా సంగతి!"

ఆ కాయితాలు చూసేక నాకంతా జ్ఞాపకం వచ్చింది.

"చెప్పుకోగలనని ఛాలెంజిచేసి మరీ చెప్పేవు. చెప్పుకో చూదాం" అన్నారు వాళ్లు.

"నేనేం ఛాలెంజ్ చెయ్యలేదు. చెప్పుకోగల్లనని మాత్రం అన్నాను."

"అన్నావుకద! మరైతే చెప్పుకో చూదాం."

వాళ్ళిద్దరికీ కూడా టీ ఆర్డర్ చేసి, కాయితాలు తీసి, నెమ్మదిగా పేజీలు తిరగేసేను.

రామారావు, రామమూర్తీ నాకు ఏడాదినుంచీ తెలుసు. ఇద్దరూ ఆనర్స్ పాసయి, రిసెర్చ్ చేస్తున్నారు. కిందటేడు నేను థర్డ్ ఆనర్స్‌లో జాయిన్ అయినప్పుడు వాళ్ళు ఫైనల్ ఇయర్లో ఉన్నారు. నేను థర్డ్‌ఫాంలో ఏడాదీ, మెట్రిక్కులో మూడేళ్ళూ, ఇంటర్ లో రెండేళ్లు బైఠాయించి లేచి, ఆనర్స్‌లోకి చాలా తీరుబాటుగా ప్రవేశించేను. నేను, క్లాసుకి చిన్నే అయినా, వయసులో వాళ్ళకంటె కొంచెం పెద్దవాణ్నే.

వాళ్ళతో నాకు స్నేహం కలియడానికి కారణం వాళ్లు సాహిత్యపిపాసు లవడం.

మారుపేరుతో కథలు రాస్తూ, ఆ ఫలానా మారు పేరు నాదేనని చిరునవ్వు నవ్వుతూ, చెప్పుకొనే అలవాటుండేది నాకు. అదొక దురభ్యాసం. మారుపేరుతో రాయడం ఎందుకు? మూర్తీ, రావులతో స్నేహం కలిసినప్పుడు ఆ దురలవాటు నాకు పోయింది. సాహిత్యపిపాసుల్ని నేను పట్టుకు వదలను. వాళ్లు ఆ రకం మనుషులని తెలియగానే తిన్నగా వెళ్లి వాళ్లకి అటాక్ ఇచ్చేసేను. నా చిరునవ్వు చూసి నా మారుపేరు విని, వాళ్ళు నన్నో చిన్న వెర్రివెధవలా చూసి, ముఖముఖాలు చూసుకున్నారు. వాళ్లు కథలు రాయకపోయినా, నాకంటె పైప్లేనులో ఉన్నారన్నమాట. సంతపాలెంలో కుట్టించుకున్న సూటు వేసుకొని, ఢిల్లీలో డాబు చెయ్యబోయిన వాళ్ళా అయింది నాపని. దాన్తో నాకు ఉడుకుమోత్తనం పుట్టుకొచ్చి, "ఏమిటి వాళ్ల సుపీరియారిటీ?" అన్చెప్పి, వాళ్లని బాగా స్టడీచెయ్యడం మొదలుపెట్టేను. వాళ్లు మాటల్లో దొర్లించిన పుస్తకాల పేర్లు గుర్తుంచుకొని, రహస్యంగా ఆ పుస్తకాలన్నీ చదవడం అలవాటు చేసుకున్నాను. నెమ్మదిగా వాళ్లని బోల్తా కొట్టించాలనే దురుద్దేశం నాలో కలక్కపోలేదు. కలిగింది.

నిజం చెప్పవలసొస్తే, ఎందుకు కథలు రాయాలో, కథ లేవి రాయాలో, ఎలా

రాయాలో, ఇటువంటి పేచీ సంగతు లున్నాయని నా కంతకుముందు తెలియనే తెలియదు. కథ రాయాలనుకోడం కూర్చోడం కాయితం కలం సిగరెట్టూ పట్టుకోడం, ఒక అందమైన ఆడపిల్లనీ, తగుమాత్రం బూతునీ, ఓ మోతాదు నాటు హాస్యాన్ని కలిపి గుచ్చేడం! అంతే! దాన్తో హాయిగా కథ తయారై పోయేది. అది పత్రిక్కి పంపితే, వాళ్లు వేసుకోపోతే, 'మెచ్చుకుంటే మించిపొయెను' అనేసుకొని గప్‌చుప్‌గా వూరుకునేవాణ్ణి. పంపినట్టైవడికీ తెలీదుకదా! లేదూ, ఆ పత్రికవాళ్లు వేసుకున్నారా! – వెంటనే కాల రెత్తేసి నేనూ నా మారుపేరూ నా చిరునవ్వూ అందరిదగ్గరా హాజరు! రోజా లలా హాయిగా వెళ్లకుండా మూర్తీ, రావులు ముళ్లకంపల్లా నాకు అడ్డొచ్చేరు.

వాళ్ళు కొత్త ప్లాట్ ఫాం మీంచి కొత్తమాటలు మాట్లాడ్డంచేత వాళ్ల అంచనా నాకు మొదట్లో సరిగ్గా దొరికింది కాదు. ఎన్ని తొడుగులు తొడిగినా, అసలు సరుకు ఆట్టే మారదని నాకెందుకో చిన్న నమ్మకం ఉంది. సాహిత్యంగురించి వాళ్ల భావాలు నాకు కొంచంగా అర్థం కాగానే, దాన్తో కొంచెం కొంచెంగా వాళ్లుకూడా అర్థం కాజొచ్చారు.

పైకి ఎలా కనిపించినప్పటికీ–డాబుగా దర్పంగా అణకువగా, అతి నెమ్మదిగా, అతిషోగ్గా, ఎంతో సింపుల్ గా ఎలా కనిపించినప్పటికీ–వీళ్ళసలు లోలోపల ఎటువంటి వాళ్లు? మంచివాళ్లా? చెడ్డవాళ్లా? వీరిలో మంచితనం ఎక్కువా? చెడ్డతనం ఎక్కువా? – అని చాలామంది గురించి నేను ప్రశ్నించుకొంటూ ఉంటాను.

నేను చాలా చిన్నగా ఉన్నప్పుడు, చీకటి పడే సరికల్లా మత్తుగా భోజనం చేసేసి, పురాణ కాలక్షేపానికి పోతూండేవాణ్ని. అలా పోడానికి కారణాలు రెండు. మొదటి కారణం: కథలంటే నేను చెవికోసుకుంటాను. గీతా రహస్యాలైనాసరే కథలుగా చెప్పేస్తే నేను చక్కగా వినేస్తాను. మరి, పురాణ కథలు వినడానికి చాలా ఇంపుగా ఉండేవి. అక్కడికి పోడానికి రెండో కారణం ఏమిటంటే: "ఆహా! ఇంత చిన్నపిల్లవానికి పురాణముల యందెంత ఆసక్తి! భగవంతునియం దెంతటి భక్తి!" అని కొంతమంది నన్ను మెచ్చుకున్నారు. దాన్తో నాకూ మన పురాణాలకీ లంకె పడిపోయింది.

పురాణకథలన్నీ వింటూండగా వింటూండగా నాకు పురాణపురుషుల్లో (దేవుళ్లలో) కొంత మందంటే ఇష్టం, కొంతమందిని చూస్తే అయిష్టం ఏర్పడ్డాయి. అప్పటి నా "అభిమాన హీరో" శ్రీరామచంద్రుడు. కాని నా వయసు కుర్రవాళ్లు చాలామంది శ్రీకృష్ణుడంటే మోజు పడిపోయేవారు. నాక్కూడా కొన్నాళ్లు మనసు అటువైపే లాగింది. కాని–

శాస్త్రులుగారు ఓనాడు పురాణం చెప్తూ చెప్తూ ఏం చెప్పేరంటే; "అప్పుడా అర్జునుడితో శ్రీకృష్ణ పరమాత్మ ఏమన్నారంటే: "ఒరే బావా! అర్జునా! వెర్రివాడా! నువ్వు చంపేవాడివీ, వాళ్లు చచ్చేవాళ్ళూనా? కాదు కాదు. ఎంతమాత్రం కాదు. చంపేవాడు లేడు. చంపునదీ లేదు. చంపబడేవాడూ లేడు. చంపడమూలేదు. అన్నదమ్ములు,

పెదబాబులు, చినబాబులు, మేనమామలు, మేనళ్లల్లు, అల్లుళ్ళు, గురువులు, గురుతుల్యులు- ఇంతమందినీ చంపేడమేనా, అమ్మో! అన్చెప్పి నీకు కాళ్లల్లో కంపంపుట్టి, గుండెల్లో దడ పుట్టుకొచ్చి మతి పోతోందా? అలా అయితే, నన్నడుగు. నువ్వు ఏమి చెయ్యాలో ఏమి చెయ్యకూడదో, చేసేవాడివీ చెయ్యనివాడివీ నువ్వసలవునో కాదో అంతా నన్నడుగు నే చెప్తాను! అన్నాట్ట. అప్పుడా అర్జునుడు...." అని శాస్త్రులుగారు చెప్పుకుపోయేరు. అప్పుడు నేను విన్నది సరిగా ఉన్నదనిగాని, అది నాకు సరిగా అర్థమయిందనిగాని నే ననడంలేదు. కాని నాకు అప్పట్లో బోధపడినంతమట్టుకు-

అమ్మో! ఈ శ్రీకృష్ణుడు మన శ్రీరాముళ్ళా అమాయకుడు కాద్రా అని నాకు గట్టి అభిప్రాయం కలిగిపోయింది. మంచివాళ్ళంతా అమాయకపక్షులేననీ, గడుసువాళ్లంతా కూడా "అమ్మో! అలా ఉన్నారనా?! చెడ్డ గడుసు వెధవలు!" అనీ మా ఇంట్లో అంతా అనుకోడంచేత నేనూ అలానే అనుకునేవాణ్ని ఆ రోజుల్లో.

మర్నాడు క్లాసులో "ఒరే ఒరే! మీ కెవర్రా ఇష్టం? శ్రీరాముడా? శ్రీకృష్ణుడా?" అని వెళ్తూనే అందర్నీ అడిగేను. దాన్తో రాముడి పార్టీ కొంతమందీమీ కృష్ణుడిపార్టీ కొంతమందీమీ అయిపోయి కూర్చున్నాం.

అప్పణ్నించీ నా కా వెర్రి పట్టుకొంది. పురాణ పురుషుల గురించేకాదు, ప్రతి చిన్న విషయంలో కూడా ప్రతివారికీ ఇష్టాయిష్టాలుంటాయి. ఇష్టా యిష్టాలనుబట్టి మనిషి తత్వం తెలుస్తుందనేది కొంత స్పష్టపడిన విషయమే కదా. ఫుట్ బాల్ ఆటకంటె క్రికెట్ అంటేనే ఇష్టం వున్నవారికీ, రెండింట్లోనూ ఫుట్ బాల్ ఆటంటేనే ఇష్టం వున్న వారికీ చాలా తేడా లుంటాయి. (గొప్ప బీదా భేదం లేకుండా) క్రికెట్ వారు పెట్రీషియన్లు, ఫుట్ బాల్ వారు ప్లీబియన్లు. వారివారి స్వభావాల్లో చాలా తేడాలుంటాయి. ఇష్టా యిష్టాలనుబట్టే మనుషుల స్వభావం తెలుసుకోవాలనే సరదా నాకు చిన్నప్పణ్నించీ ఉండిపోయింది.

శ్రీరాముడా - శ్రీకృష్ణుడా? భీముడా-అర్జునుడా? కర్ణుడా-ధర్మరాజా? రావణుడా- విభీషణుడా? కర్ణుడా-కృష్ణుడా? కృష్ణుడా-బలరాముడా? ఈశ్వరుడా-విష్ణుమూర్తా? లండనా-పారిసా? క్లైవా- డూప్లేనా? కారమ్సా-చదరంగమా? మెడ్రాసా-కలకత్తావా? శ్రీనాథుడా-పోతనా? ఉత్తరాది సంగీతమా....దక్షిణాది సంగీతమా? క్రికెటా-ఫుట్ బాలా? నెహ్రూవా-సుభాష్‌బోసా? పట్టాభా-ప్రకాశమా? గాంధీవా-భగత్ సింగా? టెన్నిసా- చెడుగుడా? రష్యావా-జర్మనీవా? చర్చిలా-రూజ్వెల్టా? లండనా-న్యూయార్కా? హాకీవా- టెన్నిసా? చీనావాళ్లా-జపానువాళ్లా? రిచర్డ్ ది లయన్ హార్టా-రాణా ప్రతాపసింహావా? హామర్షెల్డా-లుముంబావా? పద్యాలా-జానపదగేయాలా? గురజాడ అప్పారావా-రవీంద్రనాథ ఠాకూరా? విశ్వనాథ సత్యనారాయణా-కృష్ణశాస్త్రా? వోడ్ హవుసా-ఓ హెన్రీవా? 'షా' వా-చెకోవా?

ఇలా ఎవర్నయినా అడిగిచూడండి. వారికి డైరెక్ట్‌గా సంబంధించకపోయినప్పటికీ చాలా విషయాలగురించి వాళ్ళకి ఇష్టాయిష్టా లుంటాయి. ఇష్టా యిష్టాల వెనక వాటికి కారణాలుంటాయి. ఇష్టాయిష్టాలు తెలుస్తాయి. కారణాలు అంత స్పష్టంగా కనిపించవు. అవి మనం ఊహించుకోవాలి. కాని, ఈ ట్రిక్కు ప్రతి విషయంలోనూ పని చెయ్యదు. చాలా మందికి ఇద్దరూ (లేక రెండూ) అంటే ఇష్టం ఉండొచ్చు. లేకపోతే అయిష్టం ఉండొచ్చు. లేకపోతే రూజ్వెల్టు వాళ్లల్లోనే లండను వాళ్ళూ, పారిసువాళ్లూ ఉండొచ్చు. కాని అలా తెలుసుకొంటూ వెళ్తే మొత్తంమీద నిజానికి కొంచెం దగ్గరగా, మనుషుల స్వభావాల చిత్రాలు మనకి ఏర్పడతాయి.

ఈ విధంగా మనుషుల ఇష్టా యిష్టాలు తెలుసుకొని వాళ్ళని గిడికి ఇవతలో, అవతలో మార్కు చేసుకు వస్తూండగా దార్లో నాకు మూర్తీ, రావులు తగిలేరు.

పల్చగా ఎర్రగా నాజూగ్గా పాలబుగ్గలూ, సోగకళ్ళూ, కోల ముఖాలూ ఉన్న నవయువకుల్లో కొంత మందికి చిన్నపాలు ఆడ మాట ఉంటుంది. ఎందు గుండెల ఆడవారన్నా, ఆడ మాటల మగవారన్నా నాకు హడలు. వాళ్లంటే చిన్న పక్క బెదురుమీద ఎప్పుడూ ఉంటాను నేను.

మూర్తీ రావులకి, వాళ్ల ధర్మమా అని, ఆడారి మాట మాత్రం లేదు. వాళ్లు మానసికంగా కూడా ఆరోగ్యంగానే ఉన్నా రనిపించింది. పిసినారిగా లేకపోడం మంచివాళ్ల లక్షణం అని నా నమ్మకం. వాళ్ళిద్దర్లో ఎవరికీ కూడా పిసినారితనం లేదు. ఖర్చుపెడతారు. ఎందుకు, ఎవరికి ఖర్చుపెడతారనే విషయాల్లో తేడాలున్నాయి. ఆడపిల్లల్ని అల్లరిపెట్టడం, చెడ్డవాళ్ల లక్షణం అని నా అభిప్రాయం. ఆ చెడ్డపని మూర్తి చెయ్యడు, రావూ చెయ్యడు. ఎందుకు అల్లరి చెయ్యకూడదంటే వారిచ్చే కారణాలు వేరుగా ఉంటాయి. పిలక్కి తాడు కట్టుకు చదవడం మంచి వారి లక్షణం కాదని నాకో నమ్మకం ఉండిపోయింది. వాళ్ళిద్దరూ బాగా చదువుతారే కాని, ఆ విధంగా చదవరు. చాలామంది స్టూడెంట్స్‌కంటె వాళ్లకి చాలా సంగతులు తెలుసు. "శాస్త్రీయ దృక్పథం" అంటూ ఒక దృక్పథం ఉన్నదంటారు. అది వాళ్ళిద్దరికీ కూడా ఉన్నట్టుగా నాకు తోచింది. మూఢనమ్మకా లేవీ వారి కున్నట్టుగా నాకెప్పుడూ కన్పించలేదు. దారిద్ర్యం పోవాలి. సంపద పెరగాలి. అందరు చదువుకోవాలి. అందరూ కూడా పని చెయ్యాలి. విశ్వశాంతికోసం, లోక కళ్యాణం కోసం అందరూ పాటుపడాలి. అందరూ బావుండాలి–ఇటువంటి విషయాల్లో వారికి అభిప్రాయభేదాలున్నట్టు నాకేం తోచలేదు.

నా టెస్టుకి వాళ్లు ఒకంతట లొంగలేదు. ఓనాడు హొటేల్లో టీ తాగుతూ నా తూణీరంలోంచి శ్రీరాముణ్ణీ, శ్రీకృష్ణున్నీ బైటికితీసి విడిచిపెట్టేను. విడిచి పెడితే వాళ్లు విరగబడి నవ్వారు.

"నీకు ఈ కప్పు ఇష్టమా? ఆ కప్పు ఇష్టమా? ఇందులో 'టీ' ఇష్టమా? అందులో

'టీ' ఇష్టమా? ఉల్లిదోసె ఇష్టమా-ఉల్లి పెసరట్టా?" అంటూ వాళ్ల నన్ను వెక్కిరించి వేళాకోళం చేసేరు. దాన్తో నేను రంగంలోకి నా సరుకు దించడం మానేసి పక్కకిపోయి వాళ్లని పరిశీలించడం మొదలుపెట్టేను.

కొద్ది రోజులు, కొన్ని రోజులు పోయేక కొంత మట్టుకు వాళ్ళసంగతి కనుక్కోగలిగేననే అనుకున్నాను. వాళ్లకంటె నేను అధికుణ్నని చెప్పుకోడం లేదు. వాళ్ల నాగురించి ఏదో ఒక అభిప్రాయానికి వచ్చినట్టే, వాళ్ళ గురించి నేనుకూడా వచ్చేను. కాని వాళ్ళమీద నాకో అడ్వాన్టేజు వాళ్లే ఇచ్చేరు. నేను చాలా వెర్రివాణ్ణను కున్నారు వాళ్ళు. పప్పులో కాలువేసేరు.

వాళ్ళూ నేనూ ప్రతిరోజూ ఇరానీ హొటేల్లో కలుస్తూ ఉండేవాళ్లం. ఓరోజు రాత్రి యథాప్రకారం సుమారు పదకొండు గంటలకి అక్కడికి వెళ్ళేను నేను. వాళ్ళు ఆపాటికి రావలసిందే కాని రాలేదు. పన్నెండు దాకా చూసేను, వస్తారేమోనని. అప్పటికీ రాకపోతే నా 'రూం'కి పోయేను.

మర్నాడు వాళ్లే నాకంటె ముందుగా వచ్చి హొటేల్లో కూర్చున్నారు. మంచి దుస్తులు తొడుక్కుని ఇద్దరూ చాలా నీటుగా ఉన్నారు. ఒకరిది మల్లెపువ్వులాటి తెల్ల షర్టు. రెండో అతన్ది బ్యూటిఫుల్ బ్లూ షర్టు.

కుర్చీలో కూర్చొంటూ, "ఏం రాలేదు నిన్న?" అనడిగేను.

"నిన్న కొంపలంటుకున్నాయి" అన్నారు వాళ్లు.

"ఎవరితో తెచ్చేరు తగువు?" అన్నాను. కొంపలంటుకున్నాయంటే ఏదో దెబ్బలాట జరిగిందనుకున్నాను.

"చూసేవా! నీకు తెలుసుకోడా రాదు" అన్నారు వాళ్లు.

కొంపలంటుకోడం అంటే కొంపలు అంటుకున్నాయనే వాళ్ళ అభిప్రాయంట. ఆ ముందురోజు రాత్రి వాళ్ళ లాడ్జి వెనక, బయలు ప్రదేశంలో, కూలివాళ్ళ ఇళ్లన్నీ కాలిపోయేయిట. "అక్కడ ఉండిపోయేం" అన్నారు వాళ్లు.

"నేను నాకో 'టీ' చెప్పుకొని, పత్తేదార్ అరవిందుల్లా ముఖంపెట్టి, "ఇళ్లార్పడానికి మీ రిద్దరూ నడుంకట్టి రంగంలోకి దిగేరు. అవునా?" అని అడిగేను.

"ఒహో! ఒహో!" అని వాళ్లిద్దరూ విరగబడి నవ్వేరు. "నువ్వు షెర్లాక్ హోమ్స్‌వా? లేక సిల్లీఫూల్‌వా? ఇద్దర్లోనూ ఎవరంటే నీకిష్టం? సిల్లీఫూలా? షెర్లాక్ హోమ్సా?" అంటూ నన్ను ఎగతాళి చేసేరు.

"చూడ్డానికని మొదట వెళ్ళి, తీరా అక్కడికి వెళ్ళేక మంట అలా మండుతూంటే చూళ్లేకపోయేరు. ఆర్పడానికి వాళ్ళ సాయానికి దిగేరు. అవునా? కాదా?"

"అవును" అని ఒక రన్నారు.

"గొప్ప దివ్యదృష్టి" అని రెండో అతనన్నాడు.

"మీ ఇద్దర్లోనూ ఈ తెల్లచొక్కా ఎలా ఉన్నదలా పన్లోకి దిగిపోయింది. అవునా?"

"చెప్పు. చెప్పు" అన్నారు వాళ్లు.

"ఈ నీలంచొక్కా (నీ బ్లూషర్టు చాలా బావుందయ్యా) పర్సూ, షర్టూ లాడ్జిలో పడేసి వచ్చి, అప్పుడు పని ప్రారంభించింది. కాదా?" అన్నాను.

వాళ్ళేమీ అనలేదు.

"నువ్వు డేంజరూ గీంజరూ చూసుకోకుండా కాల్తున్న ఇళ్లల్లోంచి సామాన్లు బైటకి తియ్యడానికి వెనకా ముందూ చూసుకోకుండా దూరబడ్డావు!" అన్నాను తెల్లచొక్కాతో.

"నన్ను నీకు తెలుసు. చెప్పడం గొప్పేంకాదు." అన్నాడతను.

"తెలుసుకాబట్టే చెప్పగలుగుతున్నాను. అంత తెగవగా అలా దూరబడ్డందుకు నిన్ను ఈ బ్లూ షర్టు ఏమన్నాడో చెప్పనా?"

"చెప్పు"

"వెధవా! అంత సాహసం చూపించడం మంచిదే. కాని తెలివితక్కువ తనం వల్లనైనా నువ్వలా చేసుండాలి. లేదా గొప్పకోసమైనా చేసుండాలి. నువ్వు తెలివితక్కువ్వాడివి కావు అని ఈ బ్లూషర్టు నిన్ను వెక్కిరించింది అవునా?"

తెల్లచొక్కా అతను బ్లూషర్టు ముఖంలోకి చూసేడు.

"అదెలా చెప్పగలిగేవు?" అని నీలం చొక్కా అతను నన్ను అడిగేడు.

"నీ ఇష్టాయిష్టాలు నాకు తెలుసు కాబట్టి" అన్నాను.

"బాష్" అన్నాడతను.

"ఇంకా చెప్తానుం డయితే. మీ ఇద్దరూ కూడా నిన్న రాత్రి ఇళ్ళార్పడం అయేక టీకోసం మీ లాడ్జిపక్క కాకా హొటేల్కి వెళ్ళేరా?"

"వెళ్ళేం"

"ఆ మురికి బట్టల్తోటే వెళ్ళేరు. అవునా?"

"అవును"

తెల్లచొక్కాని చూపించి, "మనవాడి బట్టలన్నీ, అతి మురిగ్గానో చిరిగిపోయో ఉండుండాలి మరి" అంటూ బ్లూ చొక్కాని చూపిస్తూ, "నీ బట్టలు మాసినా, అంతగా మాసి ఉండవు. అవునా?"

"కారీ ఆన్" అన్నారు వాళ్లు.

"అక్కడ కాకా హొటేల్లో మిమ్మల్ని అందరూ చాలా ఆనర్ చేసుంటారు. కాని, వాళ్లంతా తెల్ల చొక్కా మాత్రం ఇళ్ళార్పిందనుకొని, ప్రశ్నలన్నీ ఇతణ్ణే వేసి ఉంటారు. జవాబులన్నీ, బ్లూషర్టూ! నువ్వు చెప్పుంటావు!" అన్నాను.

"ఎలా గ్రహించేవు?" అని ఒక రన్నారు.

"బ్రదర్సూ! మీతో తిరుగుతున్నాను కదా. మీ గురించి ఆపాటి గెస్ కొట్టలేనా? కథలబట్టి రచయితనీ, రచయిత బట్టి కథలనీ పోల్చవచ్చని మీరు చెప్పిన పుస్తకాల్లోనే ఎక్కడో చదివేను. అలాగే, మీ మాటలూ, మీ ప్రవర్తనా బట్టి మీగురించి గెస్‌కొట్టే నంతే!" అని అంటూండగానే నాకో అయిడియా తట్టి, "కావలిస్తే, మీరే ఏదైనా కథ చెరొకటీ రాయండి. పోల్చుకోవచ్చు" అన్నాను.

"ఎలా పోల్చగలవు?"

"మీరు రాస్తే, అందులో దేన్నిబట్టి పోల్చేనో చెప్తాను"

"మా పాత రచనలు నువ్వు చదివుండాలి" అన్నారు వాళ్ళు.

"మీరు కథలు రాసినట్టుగా నాతో ఎప్పుడైనా చెప్పేరా?" అని, వారు ఆ విషయం నా దగ్గిర అంత వరకూ దాచినందుకు చాలా చీవాట్లు పెట్టేను వాళ్లని.

"నీలా పేర్లు చెప్పుకు తిరగడం అలవాటు లేదు మాకు" అన్నారు వాళ్లు.

"చెప్పడం మానేయండి. కాని, చెరో కథా రాసి ఇవ్వండి. ఏదెవరిదో చెప్తాను. ఉదాహరణకి మీ లాడ్జి వెనకాల ఇళ్లు కాలేయి. కాలడం మీరు కళ్ళారా చూసేరు. దగ్గిరుండి ఆర్పేరు. అదే ఇతివృత్తంగా తీసుకోండి. ఒకే 'థీమ్' మీద రెండు కథలొస్తాయి. రెండు కథల్లోనూ ఏ తేడా ఎందుకొచ్చిందో చెప్తాను."

వాళ్ల నామాటలు విని నవ్వేరు. అంతా ఎగతాళిలోకి దించేరు.

ఆ తరవాత అలా హస్కు కొట్టుకుంటూ ఎవరి లాడ్జికి వాళ్ళం పోయేం.

నాకో మేనత్తగారుండేవారు. ఆవిడకో కొడుకూ, ఓ కూతురూను. ఇద్దర్లోనూ ఆవిడకి కూతురంటేనే పంచప్రాణాలూ అని ఆవిణ్ని తెలిసినవాళ్లంతా అనుకొనే వారు. ఎవరైనా ఆవిణ్ని ఎదర అలా అనేస్తేమాత్రం ఆవిడ సర్రున లేచి తెయ్యిమని ఎగిరి, "రెండు నేత్రాలున్నాయి నాకు. అందులో నాకు కుడికన్నెంతో ఎడమ కన్నూ అంతే. ఏ కన్ను ఎక్కువ ఇష్టం అంటే అందులో అర్థం ఉందా? రెండుకళ్లూ సమానమే నాకు" అని గట్టిగా కేకలేసి చెప్పేదావిడ. చిట్టచివరకు ఆవిడ తన కొడుకూ కోడళ్లకి ప్రేమాభిమానాలూ, కూతురికీ అల్లుడికీ వెండి బంగారాలూ విడిచేసి కన్ను మూసింది. "చూసేవురా! మా అత్త ఎలాటిపని చేసిందో!" అని నే నొకతన్తో చెప్తే అతను "ఏం? వెండిబంగారాలు, ప్రేమాభిమానాల కంటె ఎక్కువ కాదుకదా?" అని చమత్కరించేడు. మా మేనత్తని సమర్థించేడు.

మూర్తీ, రావుల గురించీ మా మేనత్త గురించీ ఆలోచిస్తూ, నేను లాడ్జికి వెళ్ళిపోయేను. ఆ తరవాత, వాళ్ల పరీక్షల హడావిళ్ళో పడిపోయేరు. సెలవులకి నేను ఇంటికి వెళ్లిపోయేను. ఆరాత్రి మేం మాటాడుకున్న విషయాన్ని వాళ్ల సీరియస్‌గా తీసుకొంటారనుకో లేదు నేను.

ఇంతలో సడెన్‌గా అలా ఆ రెండు కథలూ తీసుకొచ్చి నా యెదర పడేస్తే సంతోషమూ, సరదా పుట్టుకొచ్చేయి నాలో.

కాయితాలు నా ఎదర బల్లమీద పడేసి, "ఏ దేవ్రాసేరో పోల్చుకుంటా నన్నావు?" అన్నారు వాళ్లు, మళ్లా.

"అవును" అన్నాను.

"పోల్చుకోగలవా?"

"ప్రయత్నం చేస్తాను."

"చేసి, ఎప్పుడు చెప్తావు?"

"ఇప్పుడే చెప్తాను. చదవనీయండి" అన్నాను. చదవాలని నిజంగా నాకు చాలా ఉత్సాహంగా ఉంది.

"అప్పుడు మీ లాడ్జి వెనకాల ఇళ్ళు...."

"అవునదే ఆధారంగా తీసుకున్నాం."

"అయితే మీరు నెమ్మదిగా 'టీ' తాగుతూ ఉండండి. ఇప్పుడే చదువుతాను" అన్నాను.

"వేగిరం చదువు!" అన్నారు వాళ్లు.

నేను ఆ కాయితాలు తీసి చూసేను. కథలు అట్టే పెద్దవిగా లేవు.

రచయితల్నీ, వారిలో భేదాల్నీ నాకు బాగా తెలిసి ఉండడంచేతా, నేననుకున్నట్టుగా వాళ్ల రాస్తారా, రాయరా అని తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉండడంచేతా, ఆ రెండు కథలూ చాలా వేగంగా చదివీసేను.

రెండు కథలూ చాలా బావున్నాయా అంటే నేను చెప్పలేను. కాని, వాటిలో నాకొక కథ చాలా బాగా నచ్చింది. నచ్చడానికి కారణా లేమిటని ప్రశ్నించుకున్నాను. కారణాలు చాలా ఉన్నాయి. ఇదంతా రాయడం నాకేది నచ్చిందో చెప్పడానిక్కాదు. ఆ కథలు మీకు చదవాలనుంటే చదవచ్చు. వాటిని యథాతథంగా రచయితల పర్మిషన్ మీద ఇందులో జతపరుస్తున్నాను.

వాటిలో ఒక కథ ఏమిటంటే, అది-

# మంచి

ఈచెడ్డలో ఆ మంచి ఎందు కుండకూడదు? చెడ్డనే చూసేరు కాని మంచి నెందుకు చూడరు?

అందుకే-

## మొదటిభాగం (లోని)

### - ఆ -

### "కా రు మ బ్బు కి"

పెరట్లో దభీమని చప్పుడయింది.

అర్ధరాత్రి.

కామయ్య గుభీమని నిద్రలేచి, గడగడ వణుకుతూ కూర్చున్నాడు.

"ఏదో చప్పుడయిందే! చూడవే భ్రష్టుదానా!" అన్నాడు.

"భ్రష్టుదానికి" ఈ తీపితీపి మాటలూ, ఈ పీచు పీచు గుండెలూ ఇవేం కొత్త కాదు. పాతికేళ్లయి కాపరం చేస్తోంది; తన మగడి సంగతి తనకి ఇంకా ఆపాటి తెలియక పోవాలా?!

"అబ్బబ్బబ్బబ్బబ్బబ్బభ! మీరూ మీ భయాలూ కావు గాని ఇలా కాల్చుకు తినేస్తున్నారు! మీకు నిద్దరక్కర్లేకపోతే ఇవతలవాళ్ళ కక్కర్లేదా? పడుకుంటే పడుకోండి! లేకపోతే పొండి!" అంటూ కామయ్యని కాలితో పొడిచిం దావిడ. కొమ్ముల్లేవు, మరింతకంటే ఏంచేస్తుంది?

నలుగురు భార్యలు ఎనిమిది కాళ్లతో తన్ని పొడిచినా, పొడిచి తన్నినా కామయ్య భయం మాత్రం పోదు పోదు. కామయ్యని చంపేస్తే కామయ్యే చస్తాడు; అతని భయం ఉండిపోతుంది.

పెళ్ళాం కదలకపోవడం కనిపెట్టి "దేయిసామీదికి పిల్లి దుమికుంటుంది. అదే చప్పుడు! నాకు తెలుసు!" అని పెరట్లో శబ్దం గురించి కారణం కనిపెట్టేసేడు కామయ్య.

అంతలో అతని చెవిని-ఒక చెవిని-(రెండో చెవి సరిగా పన్చెయ్యదు, చెప్పిన మాట వినదు) మరో శబ్దం పడింది. ఆ చెవిలో శబ్దం చిటపట మంది.

పెరట్లో చప్పుడు పిల్లిదైతే, ఈ చిటపట శబ్దం ఎవరిది?

చిటపట చిటపట చినుకులు కావు. చిటుకూ చిటుకూ చీమలు కావు. మరైతే సీమపటాకీలా? అవంతకంటే కాదు.

ఈ చిటపటకి కారణం ఏమిటె చెప్మా అని కామయ్య తన ఒంటి చెవితో

ఆలోచిస్తూ ఉండగా-

అంతలో ఊరంతా ఒక్కసారి గొల్లుమంది.

"ఇళ్లంటుకున్నాయే లంజకానా! లేవే లేవే!!" అన్నాడు కామయ్య.

"ఇళ్లంటుకున్నాయే" అన్న ముక్క ఇంట్లో అన్నాడు, "లంజకానా! లేవే లేవే!!" అనే మాటలు వీథిలోంచి పేల్చేడు కామయ్య. ఇంట్లోంచి బైటికి శబ్దాలంత వేగంగా వెళ్లేయీ అంటే-

మరి ఇది, నిప్పుతో సరసమా? పెళ్లాంతో సరసమా? కామయ్య ఛస్తే నిప్పు ముట్టుకోడు. పాతిపెట్టాలంతే కాని, ముట్టుకోడు.

"ఇళ్లంటుకున్నాయ్" అని మళ్ళీ కేక వేసేడు కామయ్య.

అవును. ఇళ్లంటుకున్నాయి.

ఒకదానిమీ దొకటి ఒకదానిమీద మరొకటీ వూరంతా ఇళ్లన్నీ అంటంటుకొనే ఉన్నాయి. మనుషులకుండేమోగాని ఆ వూరి ఇళ్లకి మాత్రం అంటరానితనం లేదు.

అంటరానితనం జాతికి మచ్చ.

అది నిప్పుకి లేదు.

అంచేత-

"మాలకొంపలఁరో మాలకొంపలు!" మాలకొంపలే ముందుగా అంటుకున్నాయి. బారిక రాముడి ఇల్లే ముందుగా అంటుకుంది. తరవాత గొడారి కన్నయ్య గాడిల్లు అంటుకుంది. తరవాత దాసరి సత్తిగాడిల్లు అంటుకుంది. వెంటనే చాకలి సూరిగాడిల్లంటుకుంది. వెనకనే తెలికలి చిట్టెమ్మ (దాని కూతురు బావుంటుంది) దానిల్లు అంటుకుంది. ఆ తరవాత అలా వరసగా కొంపలన్నీ అంటుకున్నాయి.

ఎడ్లు కట్టు తెంపుకున్నాయి. ఆవులు కన్నెలు తెంపుకొంటున్నాయి. ఎరకలాళ్ల పందులూ చాకలాళ్ల గాడిదలూ, గొల్లల గొర్రెలు, మేకలూ ఊరిమీద తిరగబడి పోతున్నాయి. (ఇందులోని నీతిః గాడిదలూ, పశువులూ, పిల్లా మేకా, పందీ పాపా ఊరిమీత్తిరగబడకుండా ఉండాలంటే ఎక్కడున్న గుడిసెల్లో వాటిని అక్కణ్ణే ఉణ్ణివ్వండి. నిప్పెట్టి బెదరగొట్టకండి.) (ఎన్. బిః వాటికి ఎసరు పెట్టచ్చు. నిప్పెట్టకండి.)

మొత్తంమీద ఊరంతా కొంప లంటుకున్నట్లు, హాహాకారాలు పెట్టేస్తోంది. చాలా గందరగోళంగా ఉంది.

నులక మంచాలు, చింకి బొంతలు, చిన్నచిన్న పిల్లలు, పెద్దపెద్ద రోకళ్లు, ఇత్తడి బిందెలు, అంబలిదాకలు, కంచు గళాసులు, కుండలు, ముండలు, రాచ్చిప్పలు, రాగి డేయిసాలు, ముగ్గురు గుడ్డివాడి కూతుళ్లు- (కాదు అయామ్ వెరీ సారీ-గుడ్డివాడి

ముగ్గురు కూతుళ్లు)("ముగ్గురూ గుడ్డిముండలే") ఓ లమ్మో, ఓ లమ్మోలు, ఎక్కడున్నావురో రయ్యోలు, ముండ చచ్చినోళ్లు, రవికలు పిగిలిన పడుచు పిల్లలు, పైటలు జారిన వృద్ధ వనితలు, జందేలు తెంపుకున్న జంగాలు, ముగ్గురు జడ్జి వెధవలు, పాతిక బెల్లపు దిమ్మలు, కొన్ని చింకి చాపలు, మరికొన్ని నులక మంచాలు, గుండెలు బాదుకోడాలు, ఇళ్ళమీదికి ఇసక చిమ్మడాలు, నెత్తి మొత్తుకోడాలు, ధాన్యపు కుండల ప్రేలుళ్లు, పేలాల మాడుళ్లు, నూతిలోంచి ఇళ్ళమీదికి వెళ్ళే నీళ్ల కుండలు, నడికొప్పులమీంచి కిందపడే కమ్మలు, కాళ్లలేని కుంటిముండాకొడుకులు, అత్తిళ్ళు లేని విధవముండ కూతుళ్లు, నారాయినా, బగమంతుడా రచ్చించు తండ్రీలు, పొగలు పొగలు, సెగలు సెగలు, మంటలు మంటలు, హా! హా!

"కారపుగుండ కుండ ఉండిపోయిందే ముండా!" అన్నాడు కామయ్య తన ఇంటికి ఎడంగా, మంచంమీద శుభ్రంగా కూర్చొని.

"ఒచ్చి తెచ్చుకోండి. తెచ్చుకు అందులో బుర్ర పెట్టుకూర్చోండి" అంది అతని భార్య, రుబ్బురోటి పాత్రాలు రెండూ రెండు చేతుల్తోనూ పట్టుకు నొస్తూ వొస్తూ.

ఆ సమయంలో కామయ్యకి తన కొడుకూ, తన కూతురూ గుర్తుకొచ్చేరు.

అప్పులాళ్లు కనిపిస్తే యముళ్లు, పోలీసులు కనిపిస్తే జెయిళ్లు, అయ్యర్లు కనిపిస్తే ఇడ్డెన్లు, విధవలూ వంటి బ్రాహ్మలూ కనిపిస్తే అపశకునాలు, సుబ్బారాయళ్ళు కనిపిస్తే డబ్బారాయాలనేవాళ్లు ఏ న్యాయాన్నయితే జ్ఞప్తికి వస్తాయో(రో) అదే న్యాయాన్ని, ఆ పాత్రాలు చూసేసరికి కామయ్యకి తన పుత్ర పుత్రికా రత్నాలు ('జ్ఞప్తికి వచ్చేరు' అనాలా? 'జ్ఞప్తికి వచ్చేయి' అనాలా? ఎందుకీ గొడవ?....) జ్ఞప్తికి రావడం జరిగింది.

పుత్రికొచ్చిన భయమేమీ లేదు. ఆవిడ నిప్పుకి దూరంగా అత్తకి దగ్గరగా అత్తవారింట్లో భద్రంగా ఉంది. అత్తల దగ్గర నిప్పులు భయపడాలి కదా మరి!

మరింక పుత్రుడు సత్యం?

"సత్తిగా డేడే? ఇక్కడ వీధిలో ఇందాటా పడుకున్నాడు కామోలు?! ఎక్కడ చచ్చేడే వెధవా!?" అని కామయ్య అరిచేడు; తల్లికీ, కొడుక్కీ ఒకే 'వెధవ' నుపయోగించి.

కామయ్యభార్య చేతుల్లోని రెండు పాత్రాలూ కామయ్య పక్కనే ఎత్తి పడేసింది. రెండంగుళాలు అటు పడేస్తే కామయ్య గుండు పిలకతో సహా బద్దలవును. మాంగల్యానికీ, వైధవ్యానికీ అంతేకదా దూరం.

"రుబ్బురోలు చూరుకిం దుండిపోయిందే! పగిల్తే చస్తాం! సత్తిగా డేడే?" అని నెత్తి కొట్టుకు నరిచేడు కామయ్య.

"చస్తే చస్తాం. మీరొచ్చి మోసుకురండి వాడు పెళ్ళి కెళ్లేడు గామోసు!" అని ఆవిడ గావుకేకలు వేసింది. కారపుగుండ కుండకోసం వెళ్లబోతూ.

"ఎవడి పెళ్లే? ఛస్తుంటేనూ!"

"ఎవరి పెళ్లా? నా తమ్ముడి కూతురి పెళ్ళి! నా కోడలి పెళ్ళి! నా కోడలిముండ పెళ్లికి కొడుకు వెధవ వెళ్లొద్దా??! మీ కొడుకేనా వాడు! మీకు లేని సిగ్గు వాడి కెక్కణ్నుం చొస్తుంది" అంది కామయ్య భార్య కారాల మిరియాల మంటలు కక్కి కక్కి.

"ఆ రంకుముండ పెళ్ళికి ఈ వెధవ చచ్చిన వెధవ వెళ్ళడమా??.... అయినా - పెళ్లి పెళ్లి!! ఇంకేం పెళ్లిలే! నా శ్రాద్ధం పెళ్లి! వెధవలంతా ఈపాటికి కొంపకాలి చచ్చుంటారు...." (థాట్ ప్రాసెస్: కొంప కాలి వెధవలంతా చచ్చినప్పుడు, అందులో ముండలంతా చావరా మరి?).... "ముండలంతా కూడా చచ్చుంటారు!" అని కసిగా అన్నాడు కామయ్య.

చిటపట శబ్దం ఎలా ఉంది? ఊరికి నష్టంగా ఉంది. రాత్రిపూట పడమట గాలి మందహాసం చేసి ఏ రీతిగా వీచింది? మందంగా మంటలతో పాటు ఊరంతా వీచింది. మంట ఎలా ఉంది? భోగిలా ఉంది. ఊరంతా ఎలా ఉంది? దగ్గర్నుంచి చూస్తే మాడిన ఇళ్లతో, మనుషుల ఏడ్పులతో వికృతంగా ఉంది. దూరంనుంచి చూస్తే అందంగా వెలుగు చీకట్ల ఎరుపు చీకట్ల చిత్రంలా ఉంది. జనం గోల ఎలా ఉంది? దగ్గర్నించి వింటే సామ్మల సంతలా ఉంది. దూరంనించి వింటే శ్రీరామనవమి సంబరంలా ఉంది. ఇళ్ళన్నీ ఎలా ఉన్నాయి? చల్లారిపోతూ ఇంకా పోకుండా ఉన్నాయి. పొగలన్నీ ఎలా ఉన్నాయి? కారుమబ్బుల్లో కలసిపోయున్నాయి. కారుమబ్బు లెలా ఉన్నాయి? చిన్నమెత్తు కాంతిరేఖయినా లేకుండా డొస్టవిస్కి నావెల్సులా ఉన్నాయి. అందుకే-

## రెండో భాగం (లో)

**-ఈ-**

### "....వెం డి చి వు రు !"

"సత్యం సత్యం" అంది సత్యవతి కూతుర్ని కొట్లోకి నెట్టేసి, పైన గొళ్ళెం వేసేస్తూ.

ఎన్ని మనువులు చెప్పినా మేనబావ తప్ప మరో డక్కర్లేదంటుంది సత్యవతి.

"ఆ వెధవ! గుండువెధవ, ఆ నీ వెధవ బావ్వెధవ రుబ్బురోటి పొత్రంలా ఉన్నాడుతప్ప వాడికి సరైన చదువా? సంధ్యా? సెంటుభూమా? శేరు గింజలా? ఏవీ లేవు! పొత్రానికి పిండైనా ఉంటుంది, వాడి కదీ లేదు. వాడి కసలు బుర్రమీద వెంట్రుకలైనా లేవు. పట్నంలో అచ్చేసిన ఆబోతులా తిరగడం తప్ప వాడికి మరింకేం లేదు!"-

అని మేనల్లుణ్ణి తూలనాడి, కావలసిన సంబంధాన్ని కాళ్ళదన్ని, వేటపాలెం వెళ్లి నిక్షేపంలాంటి పై సమ్మంధం రైటుచేసుకొచ్చి-

"తాంబూలా లిచ్చేశాను. ఇహ తన్నుకు చావండి" అంటూ ఉద్గ్రంథంలోంచి 'కోట్' చేశాడు తిరపతి.

శాస్త్రా లెన్ని చెప్తేనేమి, గ్రంథాలెన్ని చదివి వినిపిస్తేనేమి? ఏవీకూడా మేనబావకి సాటిరావు కదా! అందుచేత తెల్లారురఝామున మూడుగంటలకి ముహూర్తం ఉందనగా, రాత్రి పదకొండుగంటలకి, తల్లి పైట చెరగున తలదాచుకొని, ఆ పైటకి ముక్కు రాసుకొంటూ, ఇంకా సత్యప్పలుకే పలుకుతోంది వంటింట్లో రామచిలుక.

దాన్తో తిరపతయ్యకి చిర్రెత్తుకొచ్చి, "చంపేస్తానే! ఇంగ్లీషు చదువులముండా!" అని కూతుర్ని తిట్టి, అలా చూస్తూండగా నిప్పులా కాలిపోయి మంచుగడ్డగా మారిపోయేడు. నిప్పులోంచి మంచులోకి దిగిపోడానికి కారణం ఏమిటంటే-

పట్నంవెళ్ళి (థర్డ్‌ఫారం) చదువూ, సినీమాలూ, వెధవలూ, షోకులూ, హైూషులూ అన్ని లబ్జులూ, అన్ని నాజూకులూ చూసి, అన్నీ నేర్చుకున్న "భడవాముండ" భగ్నప్రేమ భగ్నప్రేమంటూ, ఏ నూతిలోకి దూకేసినా దూకేయొచ్చు! ఏ కిరసనాయిలైనా పోసుకొని, ఏ అగ్గి పుల్లయినా గీసుకోవచ్చు. ఎంత సాహసప్పని చేసినా చెయ్యొచ్చు అనే ఆలోచన కలగడమే కారణం, నిప్పు మంచుగా మారుటకు.

ఈ అతిశీతలమైన ఆలోచన కలగ్గానే కన్నతండ్రికి కాళ్లు, చేతులూ చల్లబడిపోయేయి. వెంటనే అరనిమిషం జాగుచేయకుండా కూతురి చేతులు విరిచికట్టి ధాన్యపు కొట్లోకి నెట్టేసి మూడు గంటల్దాకా, "చావు ముండా" అని అందుకే కేకవేసేడు తిరపతి.

ధాన్యపుకొట్లో ధాన్యం లేవు. ఎలకలైనా సరియైనవి లేవు. బూజు లున్నాయి, ఖాళీ కుండలున్నాయి. గదంతా మాత్రం ఏమీ కనిపించకుండా చీకటిగా, భయంకరంగా ఉంది. అయితే ఆ చీకటి చూసి సత్యవతికి భయమే లేకపోయింది. ఆ కన్నెపిల్ల మనసునిండా సత్యమే ఉండడంచేత భయానికి సిగ్గువేసి బైటనే ఉండిపోయింది.

అక్కడ కరణంగారి పెరట్లో కమ్మల సాలలో పశువులూ, వీధివైపు సాలలో పెళ్ళివారూ ఉన్నారు. పెళ్ళివారున్న సాలలో పెట్రోమేక్స్‌లైటు భగ్గున వెలుగుతోంది. వెలుగులో పెళ్ళికొడుకు అలిగి పడుకున్నాడు. అలిగిన పెళ్ళికొడుకు అలిగినట్టూరుకోక, ఎందుకలా దొంగ గొడ్డులా పడుకున్నాడో ఎవరికీ తెలియడం లేదు. అలిగినందువల్ల అందరికీ మాత్రం హడావిడిగా ఉంది. అతను అలిగేడని చెప్పి, ఇవతల కొంతమంది అభోజనం ఉండిపోయేరు. కొంతమంది అభోజనం ఉన్నారు కాబట్టి మిగతావారంతా కూడా పస్తులు పడుకున్నారు. "ఆళ్లు తినేదాకా మా డొక్కలు మాడ్చేస్తే ఎలా?" అని పాలికాపులు పొలికేకలు వేస్తున్నారు. మంగలివారికీ, మగపెళ్ళివారికీ పేచీ రావడంవల్ల, బాజాలు అల్లరి లేకుండా పెళ్లి జరిగిపోతుందేమో నని ఆడపిల్లలంతా బెంగ పెట్టేసుకుంటున్నారు.

అంతా తీన్‌తారుగా ఉంది.

ఇంతలో సుబ్బులి కూతురూ, జగదాంబ మేనగోడలూ, కొత్త నాయడి చిన్న కోడలూ చిత్రంగా సింగారించుకు వచ్చి "మా సచ్చాలేదండీ! ఒదినా!" అంటూ ఇంట్లో కొచ్చేరు.

విడిదినించి పదమూడోసారి ఇంటికొచ్చిన తిరపతి ఆ మాట విని సత్యాలుమీది కోపంతో "చచ్చింది మీ సత్యాలు" అన్నాడు పెరట్లో పెళ్లాం దగ్గరకి పోతూ. ఆ మాటకి ముగ్గురు అబలలూ అలా నిలబడే మూర్ఛపోయేరు. జగదాంబ మేనగోడలు ఇంటికెళ్లేక ఉష్ణం తెచ్చేసుకుంది కూడా.

"చస్తే చావనీ! చచ్చినా కూడా వాడిచేత పుస్తె కట్టించి అప్పుడుకాని శవాన్ని దహనం చెయ్యను" అన్నాడు తిరపతి పెరట్లో పెళ్లాంతో. (అతనికి ఇంట్లో పెళ్లాం ఒకరూ, పెరట్లో పెళ్లాం మరొకరూ లేరు. అక్కడా ఇక్కడా ఒకతే భార్య).

"అసలింతకంటె మంచి సంబంధం ఈ భూ ప్రపంచంలో ఎక్కడ దొరుకుతుంది?" అనికూడా అన్నాడు తిరపతి పెరట్లో ఉన్న తన పెళ్లాంతో.

పెళ్ళి కొడుక్కి ఏ అవలక్షణంలో ఏ లవలేశమైనా ఉందా? వాడికి బూరగాలా, బట్టతలా, బ్రహ్మచెవుడా, బ్లడ్‌ప్రెషరా? ఏదీ లేదుకద! వాడికి కుంటి లేదు, గుడ్డి లేదు, గూనీ లేదు. మరింతకంటె చక్కని చుక్కగా డెక్కడ దొరుకుతాడు? మగ వెధవలే దొరకడం (లేక, మగ వెధవలు దొరకడమే) మహా కష్టంగా ఉన్నప్పుడు ఇంతకంటె మంచి సంబంధం ఎక్కడ దొరుకుతుంది?

అని ఇంట్లో తన పెళ్లాన్ని గద్దించిన సమయంలోనే తిరపతయ్యకి (కామా_బా) కామయ్యకి వినిపించిన శబ్దం (కామా) వినిపించింది.

సత్యవతికి సత్యంతో లేచిపోయి (బంగారంతో సహా) బతకాలనుందేకాని కాని చచ్చిపోవాలని లేదు. కొట్టంతా మాత్రం చీకటిగా ఉంది. మరి, చీకటికీ, చావుకీ లంకెకదా బా! అందుచేత సత్యవతికి చావాలని ఉంది. పెళ్ళికొడుకు సీట్లో సత్యంతప్ప మరెవడున్నా సరేసరే, "అమాంతం అక్కడే చచ్చిపోతాను"- ఇది ఘోర ప్రతిజ్ఞ. అప్పుడు తన తల నత నాళ్లాళ్లో పెట్టుకొని, సత్యం విలవిల్లాడుతాడు. "అయ్యో! నే చచ్చిపోతానా?" - అంటూ వలవలావల ఏడ్చేసింది సత్యవతి. ధాన్యపుకొట్టు జీవితమంతా ఆమెకి అంధకార బంధురంగాబగా తోచింది. ఆవిడకి చావు తప్ప మరేదీ, చావడం తప్ప మరో దారేదీ కనిపించడం లేదు డు.

కాని భయపడకు సత్యవతీ భయపడకు.

కన్నీటికెరటాల వెన్నెలుంది. నిట్టూర్పు గాడ్పులో నెత్తావుంది. పాషాణాణ ఏదోపై మరేదో ఉంది. మరింక,వికృత క్రూర క్షుదాక్షుభిత కఠోర ఏదో ఏదోలే నవ్వుంబొంది కదా! నీకు కళ్ళనిండా నీరూ, చీకటీ తప్ప ఇంకేం లేకపోవడంచేత ఇంకేం కనిపించలేదు డు. నీ యింటి నడికొప్పు వెలుగుల రవ్వలు చిమ్ముతోందన్న సంగతి నీకు తెలీదు. ఎలాల లా తెలుస్తుంది? మట్టిమిద్దె అడ్డుందికదా. సత్యం ధ్యాసలోనే ఉండడంచేత కమ్మల సురసురుసుర నీ చెవికి వినిపించడం లేదు.

పెద్దసైజు పాత్రంలా నిల్చున్నాడు సత్యం. అతని హాలీవుడ్ గుండు రష్యా్యాన్ రాకెట్‌లా మెరిసిపోతోంది. అతని (నకిలీ) పంట్లానికి అసలేదో వెతకాలంటే టెక్సాస్స్ పోయి చూడాలి. ఎందరో నవ యువతీమణులు చూసిన అన్ని హాలీవుడ్డు చిత్రాల్లోనాల్లోని అందరు హీరోల హీరోయిజమూ ఆ సమయంలో అతనిలో మూర్తీభవించింది.

పెళ్లివారి విడిదికి ఆమడ దూరంలో ఒక చిన్న అర యిల్లు అంటుకోగానే ఇక్కడున్నాడ పెళ్లికొడుకు అలకమటుమాయమై పోయింది (అలకలు తీరాలంటే ఇళ్లంటుకోవాలి? ఏం?) అవబోతూన్న పెళ్లిని దృష్టిలో ఉంచుకొని కాలే కొంపల్నికూడా దృష్టిలో ఉంచుకొని కొని, "అపశకునం, అపశకునం" అంటూ గోలపెట్టేసేడతను..

తిరపతి భార్య పెళ్లిసామాన్లూ, వెండి బంగారాలు ఏరుతోంది. భోషాణప్పెట్టెనెట్టెని సాయంపట్టించి బైటకి తెప్పించేడు తిరపతి. పెట్టె బైటకొచ్చేసరికి తాతలు దిగొచ్చేరు. రు. నడికొప్పుకి నిప్పంటుకుంది.

"చచ్చేన్రా భగవంతుడా!" అంటూన్న తిరపతిని-

"మావా! సత్యాలేదీ?" అని అడిగేడు సత్యం.

"కొట్లో ఉంది. అమ్మో!! ధాన్యంకొట్లో ఉండి పోయిందర్రా పిల్లా!!" అనిఅని గావుకేకలు వేసేడు తిరపతి.

"నాకు చావు తప్పదుకాబోలు. నే చచ్చిపోతాను కాబోలు. ఈ బొక్కి మొగుడు నాకు తప్పడు కాబోలు దైవమా! లాభంలేదు, నే చచ్చిపోతాను. అయ్యో అయ్యో నే చచ్చిపోతాను. పోతాను పోతాను నే చచ్చిపోతాను" అని మట్టిగోడకి నెత్తి కొట్టుకోబోయింది సత్యవతి.

అంతట అంతలు పిడుగులు పడ్డాయి, ఇంతలు మెరుపులు మెరిసేయి. గుమ్మానివి తలుపులు విడ్డాయి.

పూలబాణాల్లా సత్యం చేతులు సత్యాల్ని ఎత్తుకున్నాయి.

"బంగారు బావ! తీసుకుపో బావా!" అంది సత్యాలు.

"బంగారం, బంగారంలా తీసుకు పోతాను!" అన్నాడు సత్యం.

"బృందావనానికి, మల్లెపూపొదలచాటుకి, అక్కణ్ణించి కొత్తకొత్త సినీమాలకి తీసుకుపో బావా!" అంది సత్యాలు.

"కలసివుంటే కలదు సుఖం-'ప్రభాత్'లో తెలుగు. బ్యూటిఫుల్ 'పిలోటాక్'- అది 'లీలా'లో ఇంగ్లీషు అన్నాడు సత్యం.

"సెలెక్ట్‌లో హిందీ పిక్చరేముంది" అని అడిగింది సత్యాలు.

"ముహబ్బత్! ముహబ్బత్!" అన్నాడు సత్యం సత్యాల్ని ఎత్తుకు నడుస్తూ.

మరో అరగంటకి పట్నంవైపాక జట్కా పరుగెడుతోంది.

జట్కాలోంచి, దూరంనుంచి, చీకట్లోంచి, బావవళ్లోంచి స్వర్గానికి వెళ్తూ వెళ్తూ అటొకసారి, కాలిన ఊరివైపు చూసింది సత్యాలు.

కాలిన ఊరంతా కెంపుల తోటలా ఉంది. వీచే పడమటగాలి (ప్రణయ) కోపించిన పడుచుపిల్ల ఊపిర్లా ఉంది. సుడులు తిరిగిన పొగలు, చక్కని రాకన్యల ముడులు విడిన కురుల్లా ఉన్నాయి. రేగిన నిప్పు రవ్వలు ఆ నీలి కురుల్లోని బంగారు పువ్వుల్లా ఉన్నాయి.

సత్యాలు అటువైపోసారి చూసి, "భోగిమంటలా లేదు బావా?" అంది కమ్మగా.

"ఉంది" అన్నాడు సత్యం వెచ్చగా.

"ఊరు కాలడమే మంచిదయిందికదు బావా?" అంది సత్యాలు ముద్దుగా.

సత్యం మంచిమంచి ముద్దులిచ్చేడు జవాబుగా.

.... ....

ఆ ఇళ్లే కాలకపోతే ఈ కథే లేదుకదా మరి!

.... ....

అ ద్దొ క క థ

చదివేను, కాని వాళ్లవైపు చూళ్లేదు. చూస్తే ఎవర్రాసేరో తెలిసిపోవచ్చు. ఆ కథ చదివేక, వెంటనే, రెండో కథ తీసేను. అది–

## చెడ్డ

కాలినప్పుడు తప్ప అక్కడ కమ్మగుడిసెల వాడొకటుందని పట్నంలో పెద్ద లెవరికీ జ్ఞాపకం రాదు. జ్ఞాపకం చెయ్యడానికే కాబోలు అది మాటిమాటికీ కాల్తూ ఉంటుంది.

ముడిమీద ముడి వేస్తేనే కాని డబ్బు ఉండదనే విషయాన్ని అనుభవంమీద తెలుసుకున్నాడు లోవరాజు.

కూలివాళ్ళకి ప్రతిరోజూ మస్టరు వేస్తూనే ఉంటాడు సూపర్‌వైజరు. నెలాఖర్న లెక్కలు కూడి లెక్కప్రకారం కూలీలందరికీ డబ్బిచ్చేస్తూనే ఉంటాడు కూడాను. మస్టరు ప్రకారం డబ్బులు సరిగానే ముడుతున్నాయి. కాని, మనం పడ్డ కష్టంప్రకారం మస్టరు సరిగానే ఉంటోందా అని ఓరోజున లోవరాజుకి అనుమానం కలిగింది. ఆ నెల్లో "వోరాంరోజులే నాగా ఎట్టేనుగదా! పది రోజులికి కోత గోయిస్సినాడేం జెప్మా?" అనుకున్నాడు.

ఒక సున్నానీ తొమ్మిది అంకెల్నీ భారతీయులేనాడో సృష్టించి ప్రపంచం అంతటికీ తెలియజెప్పేరని చరిత్ర చెప్తోంది. ఆ సృష్టితో లోవరాజుకి ఆట్టే సంబంధం లేదు. వందలచొప్పున వెయ్యిదాకా లెక్కెట్టగలడు కాని, పదిదాకా రాయలేడు. సున్నాకూడా సరిగా చుట్టలేడు. ఒక గీతైతేమాత్రం గియ్యగలడు.

రోజు కో గీతచొప్పున, పనికెళ్లిన ప్రతిరోజూ బొగ్గుతో గోడమీద గీత గీద్దామంటే, ఇంటికి కమ్మలదడే కాని మట్టిగోడైనా లేదు. ఎలారా దేముడా అని ఆలోచించగా ఆలోచించగా లోవరాజుకో అయిడియా తట్టింది. వెంటనేఇంట్లో మంచాన్ది నులకతాడు తెంపి, ఓ రోజు పనికొక ముడిచొప్పున వేసుకొంటూ సరిచూసుకోడం మొదలు పెట్టేడు. నెలాఖర్న మేస్త్రీనీ, సూపర్‌వైజర్నీ తాడుతో టకాయించేసరికి అప్పణ్ణించీ మస్టరు సరిగా పడ్డం, డబ్బులు సరిగా కిట్టటం జరుగుతోంది.

ముడులేసి డబ్బు నిలవెయ్యాల్సిన అవసరం లోవరాజుకి చాలా ఉంది. ఆర్నెల్లికోసారి అతని తండ్రి నాటు నుంచి పట్నం వచ్చి–

"అయ్యొర్రే! నువ్వు డబ్బు జేగరత్త జేస్తేగాని భగమంతుడు మన్ని రచ్చించడు. పైస తక్కువ సెయ్యకండా అసలొడ్డీలు కక్కితెగాని పెద్దోడిగారి సిన్నయ్య మన మడిసెక్కొగ్గడు. ఒగ్గడంటే ఒగ్గడు. పెద్దోడు ఈ మద్దెలే సచ్చినాడు. ఆడున్నా అంత పరవానేకపోను. ఆడి కొడుకు– ఈ సిన్నయ్యగోడు–తక్కువోడుగాడు. జెరుమనీ

వోళ్లాటోడు! రావుణాసురుడి తమ్ముడు! నాన్జాస్తే ముసలా ణ్ణయిపోన్ను. మడిసెక్కా నువ్వు దున్నాల, నీ కొడుకు దున్నాల. మరి నాపనై పోనాది. మరింక, అయ్యొర్రే, బారవంతా నీ మీదరే ఉంది!"

అని కొడుకు చెవిలో ఇల్లు కట్టుకున్కార్చాని చెప్పిపోతూంటాడు.

అందుచేత-

"కుటుంబంతో పట్టం పారొచ్చిన" లోవరాజు రోడ్డుకూలి చేస్తున్నాడు. అతని భార్య, నూకాలు కొండ కటింగుదగ్గర మెట్లంగి కొడుతోంది. వాళ్ల పెద్దకూతురు గంగాలు, నావల డిపోకి అన్నం కారేజీలు మోసుకు వెళ్తోంది. చిన్న కూతురు డాక్టరమ్మగా రింట్లో, పిల్లల్ని ఆడిస్తోంది. మూడోది "ఆడపిల్లల ఆవుస్టల్లో, నాస్టల్లో, ఏటో అంటారు, ఆ పేరే సరీ తెల్దు" అందులో జీతానికి ఊడుప్పనీ జీతం లేకుండా తోటపనీ చేస్తోంది. నాలుగో పిల్ల అయిదునీ, ఆరునీ ఇంటివద్ద ఆడిస్తూ వంటపనికూడా కొంతమట్టుకు చూస్తోంది. అయిదోవాడు మగపిల్లడు. ఇంకా, గొట్టికాయలు సరిగ్గా ఆళ్లేడు. (తరవాత రెండు కాన్పులు పోయేయి.) ఆఖరిది (మళ్ళీ ఆడపిల్ల) పాలు తాగడం, పాకరడం, మన్ను తినడం, గుడ్డ ఉయ్యాల్లో పడుక్కోడం, జబ్బుతో ఏడవడం తప్ప మరో పనేదీ (డబ్బుక్కాని, మరెందుక్కాని) చెయ్యలేకుండా ఉంది.

మగపిల్లడు 'కడుపుల పడ్డప్పుడు' లోవరాజు సంసారం పట్నానికి మారింది. వాడి కిప్పుడు ఆరేళ్లు. అప్పటికి గంగాలు పొడవుగా, 'పతలాగ్గ' ఉంది కాని ఇంకా చిన్న పిల్లకిందే లెక్క. ఇక్కడికి పట్నం వచ్చేకే, "రాండేళ్ళుగ్గాబోలు" బాగా సాగింది, బిగిసింది, కలకల్లాడుతూ విడింది.

గుర్రంలా పెళ్లం ఎదగ్గానే, పట్టుకుపోదామని దాని మొగుడు "ప్రారాడా మరి." పారొచ్చాడు. "పారొచ్చి" పెళ్ళాన్ని రమ్మన్నాడు. వెళ్తాననే గంగాలూ అంది. కాని, తల్లి అడ్డొచ్చి "నాల్రోజులు ఆగరా నాయనా!" అంది అల్లుణ్ణి.

నాలుగు రోజులు వెళ్ళిపోయి చాలా రోజులయింది.

"పెద్దమనిసయి విప్పటి కెన్నోయేడు? నాలుగోయేడు! అవునా గాదా? అవునుగద! మరి నానింక పెల్లెందుకు సేసుకున్నట్టు? పెల్లాన్ని సాకడానికి సేసుకున్నానా? నేకపోతే పట్టవంట అబ్బడ్డోల్లకీ అన్నం గేరేజీలు తిప్పించి తిప్పించి అయ్యసేతులో డబ్బు లొయ్యించడానికి సేసుకున్నానా?"

అని అయిదు రోజులకిందట అల్లుడు మళ్ళీ వచ్చి నానాఅల్లరీ చేసి వెళ్ళిపోయేడు.

లోవరాజుకి పౌరుష మొచ్చింది.

"సెస్! ఏటీ సంత?! కొత్తామాస ఎల్లనిచ్చి ఆడిపెల్లాన్ని ఆడికాడికి తోలేయాల!" అనుకున్నాడు. అల్లుడి అల్లరిలో అన్యాయం ఎంతమాత్రం లేదుకదా! అటువంటప్పుడు

కూతురు తెచ్చే పది కాయితాలకీ "బెమపడ్డం తప్పు తప్పు, శానా తప్పు!" అనుకున్నాడు లోవరాజు.

అయ్యకి చెప్పలేదు, ఆలికి చెప్పలేదు కాని, కలిగిపోడం మాత్రం లోవరాజుకి విరక్తి కలిగిపోయింది. ఎండలంట రోడ్లకి మన్ను మోసి, కొండలంట ఎండా వానల్లో రాళ్లు మోసి "ట్రిప్పుకి మూడు కోసుల్సొప్పున రోజుకీ రొండు ట్రిప్పులు, మద్దేనపేళ" అన్నపు గిన్నెలు మోసి, "డాట్రమ్మ ఇంటికాడ పొద్దల్లా ముగ్గురు పిల్లల్ని" మోసి మోసి, పూటకి "యాపై గదులు నాలు గొరండాలూ తుడ్డానికి" రోజల్లా చీపుళ్లు మోసి మోసి, ఇలా ఇంటిల్లిపాదీ "ఓ పొద్దుగాదు, రొండు పొద్దులు గాదు-ఆరేళ్లు-ఈ కొత్తామాసొస్తె సరాసరిగ వేడోయేడు సొరబడ్డది"-ఆరేళ్లపాటు అన్ని బరువు పొద్దుల్ని నెత్తిని మోసుకు 'ఈడ్సుకొస్తే" సరిగ్గా మిగిలినవి పది పదులూ పద్దైదులూను.

ఈ లెక్కని చూస్తే ఎనిమిది వందలు కూడ్డం ఎప్పుడు? మడిచెక్క విడ్డం ఎప్పుడు? 'సెక్రాలు తిరగడవేఁ అవుపిస్తంది గాని బండి నడ్డం అవుపించదు!" మరింక, ఎంతయినా ఇంతేలా ఉంది. 'దురాసె తప్ప మరేట్నేదు. మనిసి సస్తే ఆసె మాత్తరం ఉండిపోద్దా యేటి? అదీ సస్తి!"

అందుకే-

ఆరోజు రాత్రి ఏడున్నర గంటల సమయంలో-ఎనభయ్యారు పాకల మధ్యలోంచి, ముప్పైమూడు వంకీలు తిరిగి - ఇంటికొచ్చి అలా చతికిలబడిపోయేడు లోవరాజు. కళ్లు పీకుతున్నాయి; నరాలు తోడేస్తున్నాయి; చెమటతో దుమ్ముతో వళ్లంతా అంబల్లా ఉంది. కాస్సేపు అలా కూర్చొని నెమ్మదిగా లేచి, ఇంటిముందు గోలెం దగ్గరికి వెళ్ళి, అందులో నీరు తబుకుతో గోకి తీసి, నీళ్లు పుక్కిలించి ఉమ్మి-

"నూకాలూ! ఇయాల నీరు తేలేదేటే?" అని అడిగేడు లోవరాజు.

ఎనిమిది కాన్పులతో ఎండెండిపోయియున్న నూకాలు, మగడు వేసిన ప్రశ్నకి ఏడుస్తూ లోనుంచి బైటకొచ్చింది.

"పంపులు పాడైపోనాయంట. నీళ్ళబండికాడ కెల్తే ఇంటి కో కుండణ్నీరే ఇచ్చినారు. నుయ్యి జూస్తే శానా దూరం. పిల్లెళ్ళి తేనేకపోనాది" అంటూ ఏడుస్తూ చెప్పింది నూకాలు.

"ఆపాటిదానికి ఏడాలటే ఎర్రిదానా!"

"అది కాదరా....నాయినా!"

"మరైతే, ఇంకేటి?"

"ఇదిరా దేవుడా! ఇందుకురా! సూడ్రా!" అంటూ పిడికిలి విప్పింది నూకాలు.

ఆకాశంనిండా చింకిమబ్బులు పేలికలై ఈదురుగాలికి చెల్లాచెదరై పరిగెడు

తున్నాయి. గుమ్మంలో ఉన్న గుడ్డిదీపపు కాంతి ఇంటి ముందున్న గోలెందగ్గరికి ఆనడం లేదు. ఆమె చేతిలో ఉన్న అవేవో అవి, పాలిపోయి గడ్డ కట్టిపోయిన పాపాలు నాలుగులా ఉన్నాయి.

"అయేటో సూసినావురా?!" అని నూకాలు ఏడుస్తూ అడిగింది.

"రూపాయలు కదటే? నేక, అర్దలా?"

"రూపాయలేన్రా రూపాయిలే!" అంటూ వాటిని నూకాలు జారవిడిస్తే, అక్కడే ఉన్న కుళ్ళిన పేడలో పడ్డాయవి.

లోవరాజు కేమీ అర్థంకాలేదు.

గట్టిగా, "ఏటిదంతా?" అన్నాడు.

"రైకలోంచి రాల్నాయిరా! బాబూ, బగమంతుడా!" అంటూ ఏడుపు హెచ్చింది నూకాలు.

"రైకలోంచి రాల్డవేఁటే?"

జరిగిన విషయమంతా నెమ్మదిమీద అర్థమయింది లోవరాజుకి.

చీకటిపడ్డాక ఇంటికొచ్చిందట గంగాలు. ఇంటికొచ్చి, చీకట్లో కోక మార్చుకుందట. "ఆ యెనక గవ్పున రైక మార్సబోయేతలికి" నాలుగు తెల్లరాళ్ళూ కిందకి రాలేయిట. ఎక్కడ వివి? ఎందుకిలా దాచేవె? అంటె ఏడ్చిందట. చెప్పలేదట. 'ఏడ్డమేగాని సెప్పనేద'ట. 'అయెనక, సెప్పను సెప్పనంది'ట. ఆకరువున దాసకండా నిజెం సెప్పేసిందట.

"ఏటా నిజెం?"

హొటేలువాడు ఇచ్చేట్ట!

ఎందు కిచ్చేట్ట?

అందుకే ఇచ్చేట్ట!!

"ఇవ్వడవేఁ కాదరా!"

అర్థమయింది.

"పీకలమీద కొచ్చిందిరా."

అర్థమయింది లోవరాజుకి.

"మూడో నెల్రా!"

అర్థమయింది! చెప్పక్కర్లేదు!!

అర్థమయిందంతా లోవరాజుకి. అర్థంకాగానే కసుక్కున కడుపులో ఎవరో కత్తితో పొడిచినట్టయిందతనికి.

ఇంకెన్నో పాపాలు పండాలి, ఇంకెన్నో ఘోరాలు జరగాలి, ఇంకెన్నో బతుకులు కాలాలి, ఈ జీవితం అప్పుడు తెల్లారాలి.

ఎంతసేపు, లోవరాజు ఇంటిముందు అలా కూర్చున్నాడో తెలీదుకాని-

అంతలో-

జనం గొల్లుమన్నారు.

చూస్తూండగా అరనిమిషంలో అంటుకుంది మసేనమ్మ ఇల్లు. ఇల్లంటుకున్న పావు నిమిషంలో ఇంటోవున్న సారా ట్యూబులు అంటుకున్నాయి. ఆర్పడం ఇంకెవడి తరం?!

కత్తులు కటార్లతో, బాణాలు బల్లాలతో, ఈటెలు వేటకుక్కలతో, వేటాడి వెంటాడి తరిమితే పరిగెట్టినట్టు పరుగు తీస్తేతప్ప ప్రాణాలు మరింక దక్కవు దక్కవన్నట్టు పరిగెట్టుకొస్తోంది ఈదురుగాలి. చీమలపుట్టమీద కాలేకొరకంచు పడేస్తే, భయపడి హడలిపోయి, వాటి చిన్న చిన్న ప్రాణాలకోసం అటూ ఇటూ కంగారైపోయి పరిగెట్టే చలిచీమల్లా జనమంతా పరిగెడుతున్నారు. ఇదిసుమా ఈ బతుకులోని బాధ. వొచ్చొక్కసారి చూడమని భగవంతుణ్ణి పిలవడానికా అన్నట్టు హడావిడిగా పరిగెడుతున్నాయి చెలరేగిన పొగలు.

ఎక్కడా చుక్క నీరు లేదు. గాలి చూస్తే గట్లు తెంచుకు ప్రవహిస్తోంది. ఇళ్లు చూస్తే గడ్డిబుంగలు నయం అనిపిస్తున్నాయి.

ఇల్లంతా భస్మం అయిపోయి అంతా సర్వనాశనం అయిపోయినా-

"ఏ దెలా పోతే పోనీ" అనేసుకొని అలా నిల్చుండి పోయేడు లోవరాజు.

చూరుకింద ఉన్న పిల్లలు బైటకొచ్చే లోపున ఇంటి నడికొప్పు అంటుకున్నా దప్పుడే.

బతుక్కంటే డబ్బే ఘనమైపోయినప్పుడు, పంచప్రాణాలకంటె చిల్లరడబ్బులే ఎక్కువైపోయినప్పుడు ఎందుకు మనకి బతుకు? మనకి బతుకే అక్కర్లేనప్పుడు ఈ యిల్లెందుకు? ఈ సంసారం ఎందుకు?

అనిపించింది లోవరాజుకి. వాడ వాడంతా పెనుకేకలతో ప్రళయంలోలా ఉంది. అమ్మా చెల్లీ, అయ్యా చెల్లీ అంటూ పక్కన పిల్లలేదో గోలచేస్తున్నారు. గోలలో ఏమీ వినిపించడం లేదు లోవరాజుకి.

కాని, ఆ సమయంలో టక్కున నెత్తిమీ దెవరో కొట్టినట్టనిపించిం దతనికి. ఆరేళ్ల తన కష్టం పోతే పోయింది. కాని తన భార్యది, తన చిన్న చిన్న పిల్లల్ది వాళ్ల కష్టాన్ని నిప్పులపాలు చెయ్యడానికి తనకి హక్కు లేదు, హక్కులేదు, హక్కు లేదంటే లేదు. ఆ కష్టమంతా కర్రపెట్టెలో మూతలేని కుండపిడతలో పది పదులు పదైదులు

కాయితాల రూపంలో ఉండిపోయింది.

ఇల్లంతా కమ్మల గొడుగు కాలినట్టు కాల్తోంది. ఆరేళ్ళపాటు కాలి ఆరి కాయితాలుగా మారిన కష్టం కోసం అతను పరిగెట్టినప్పుడు, "చచ్చేవురా లోవరాజా!" అని ఎవరో గావుకేక వేసేరు. పిల్లలు కళ్ళు మూసేసుకున్నారు.

పిల్లలు మళ్ళీ కళ్లు తెరిచేసరికి, చేత్తో కుండపిడత పట్టుకొని వాళ్లపక్కనే నిల్చున్నాడు లోవరాజు.

"హమ్మయ్య!" అనుకున్నాడే కాని, అంతలో అతని చెవుల్లో పిడుగులు పడ్డాయి.

"అయ్యా అయ్యా! సెల్లిరా అయ్యా! సెల్లేది రయ్యా?"

"ఏ సెల్లి?"

"సెల్లిరా! మా సెల్లిరా! మన సెల్లిరా ! అయ్యోరే అయ్యోరే సెల్లేదిరయ్యా?"

లోపల గుడ్డ ఉయ్యాల్లో ఉండిపోయిన కూతురి కోసం లోవరాజు పెనుకేక వేసి పరుగుతీసేలోపున, కర్రలోంచి గొడుకు కిందికి జారిపోయినట్టుగా, ఇంటి కప్పు మంటలతో సహా కిందికి కూలబడిపోయింది. మెరుపు మెరిసినట్టయిపోయింది. పిడుగు పడ్డట్టయిపోయింది.

"తొలిచూలిది నూతిలో తేల్తోంది; మరి నా కడసారి దేది మావయ్యా?" అని ప్రశ్నించింది నూకాలు.

ఏడుపుకంటె నవ్వే ఒకప్పుడు భయంకరంగా ఉంటుంది.

"డబ్బుకి బలయింది. అదిగో, చూడు అక్కడ కాల్తోంది!" అని నవ్వేడు లోవరాజు.

కాలిన వాడవాడంతా చిలకలకోసం వేసిన చితిలా ఉంది. మండే మంటంతా స్వర్గంకోసం చేసుకొనే యజ్ఞంలోని హోమజ్వాలలా ఉంది.

అంతలో, ఈదురుగాలంతా నిర్ఘాంత పోయినట్టుగా నిలబడిపోయింది. చంటిపిల్లతో సహా కాలి మండి మాడి బొగ్గయిన ఇంటిచుట్టూ చేరి, రెక్కలుమాత్రం కాలిన మిగతా చిలకలన్నీ తలలొంచుకు నిల్చున్నాయి. కాలి చల్లారుతున్న ఇళ్లల్లోంచి బాధలు చిమ్మినట్టుగా చిమ్ముతూన్న పొగలన్నీ బరువుగా తిన్నగా పైకిపోయి మరింక కనిపించకుండా ఏమీ కాకుండా పోతున్నాయి.

అన్నదాతా! నీ చేతి పిడికెడు మెతుకులు మాకు మరింక వద్దు వద్దు. ఆర్తత్రాణ పరాయణా! మా గోల నువ్వింక వినవు వినవు. దయార్ద్రహృదయా! నీ జాలి నీ కన్నీరు మాకింక ఎందు కెందుకు? జగద్రక్షకా! నీ రక్షణ మా కెప్పుడూ లేదు లేదు. సర్వలోకపాలకా! నీ పరిపాలన మాకు మరింక చాలు చాలు!

కథ జరక్కూడదు. జరిగినది మరింక పెరక్కూడదు.

.... .... ....

రెండు కథలూ చదివేసి, కాయితాలు బల్లమీదపడేసి మరో మూడు కప్పులు 'టీ' తెమ్మన్నాను.

"ఏ దెవరం రాసేమో పోల్చుకుంటానన్నావు?" అన్నారు వాళ్ళు.

"పోల్చుకున్నానే" అన్నాను.

"మరైతే చెప్పు! ఈ సస్పెన్సెందుకు?"

నా మారుపేరు చెప్పుకున్నప్పుడు ఎలా నవ్వేవాణ్నో అలా నవ్వుతూ ఎవరి కథ వారి చేతి కిచ్చీసేను.

ఎలా పోల్చేవని వాళ్ళు నన్నడిగేరు.

వాళ్ళను నాకు తెలిసినంత బాగా తెలిసినప్పుడు, వారిలో ఎవరేది రాసేరో పోల్చుకోడం ఏమంత కష్టమైన పని? కాని-

పాఠకమహాశయులారా!

పై రెండు కథలూ మీరు చదివేరా?

చదివేరు కద.

"వాటిలో ఏది మూర్తి రాసేడు? ఏది రావురాసేడు?" అని నేను మిమ్మల్ని అడగను. మీకు వారిని తెలీదు. వాళ్ళగురించి ఏ భోగట్టా అయినా సరిగా నేను చెప్పలేదు. అందుచేత మిమ్మల్ని అదేం అడగను.

కాని, ఒక్కటడుగుతాను.

ఆ రెండు కథల్లోనూ-

ఏది మీకు ఇష్టం?

రెండూ ఇష్టమేనా! అయితే....ఏదెక్కువ ఇష్టం?

అబ్బే! అలాక్కాదు; రెండూ ఇష్టం లేదంటున్నారా! అలా అయితే.... ఆ రెండింట్లోనూ....కనీసం ఏదంటే తక్కువ ఇష్టం?

ఇష్టం. ఎక్కువ ఇష్టం. తక్కువ అయిష్టం-ఎద్దైనా ఎందువలన ఎందువలన?

సమాధానం మీకు మీరుచెప్పుకొంటే మీ మీ స్వభావాల గురించి మీకే కొంతగా సరిగా తెలియొచ్చు.

భారతి, జనవరి, 1962